క్లుప్తంగా

వెన్నాదేవిలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు



సత్తెనపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా సత్తెనపల్లి మండలం వెన్నాదేవి గ్రామంలో శుక్రవారం డాక్టర్ సాయి తేజ రెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 141 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా జనరల్ ఓపి 17 మంది, హైపర్ టెన్షన్ 42 మంది, డయాబెటిస్ 32 మంది, హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిస్ 32 మంది, గర్భిణులు 12 మంది, చిన్నారులు ఆరుగురు ఉన్నారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ నడవలేని వారి గృహాలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు ఆరోగ్య బోధన చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఏ.వరలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి డి.తిరుమల వాణి, ఏఎన్ఎం షేక్ మస్తాన్ బి, హెల్త్ అసిస్టెంట్ బి. కిరణ్ కుమార్, డీఈవో జి.ఇజ్రాయిల్, ఆశ కార్యకర్తలు నాగజ్యోతి, ఎం.లక్ష్మి,ఎన్‌వివి. రమాదేవి, తదితరులు ఉన్నారు.

ఇనిమెట్లలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు

రాజుపాలెం: మండలంలోని ఇనిమెట్ల గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ శుక్రవారం వైద్య సేవలు అందించారు. డాక్టర్ నవ్య 100 మందికి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అందులో 17 మందికి బీపీ, 19 మందికి షుగర్ బిల్లలను 15 రోజులకు సరిపడ మందులను పంపిణీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు పరీక్షలు నిర్వహించి సలహాలు సూచనలు అందించారు. గ్రామంలో నిర్వహించిన గ్రామోదయంలో మండల స్థాయి అధికారులైన ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, ఎంఈఓ మల్లిఖార్జునశర్మలు ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓపిఆర్‌డీ ముక్కంటి, ఏఎన్ఎం లావణ్య, ఎమ్ఎల్‌హెచ్‌పీ మనీషా, తదితరులు పాల్గొన్నారు.

రేకులు మీద పడి వ్యక్తి మృతి



గోళ్ళపాడు(ముప్పాళ్ళ): ఈదురుగాలులకు ఆయిల్ మిల్ పై కప్పు కూలీ రేకుల పై ఉన్న సిమెంట్ రాయి తలపై పడడంతో తీవ్ర గాయమై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కూలీ మృతి చెందిన ఘటన శుక్రవారం జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఫిరంగిపురం మండలం కండ్రిక గ్రామానికి చెందిన పులగందాని(25) అనే యువకుడు గత కొంతకాలంగా ఆయిల్ మిల్‌లో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం భారీ ఈదురుగాలులకు మిల్ పై కప్పు రేకులు లేచి పక్కనే పడ్డాయి. రేకుల పైన ఉన్న సిమెంట్ రాళ్ళు మిల్లులో ఉన్న దాని తలపై పడటంతో తీవ్ర రక్తస్రావం కావడంతో అపస్మారక స్థితికి చేరాడు. గమనించిన మిల్లు నిర్వాహకులు నరసరావుపేటలోని ప్రవేటు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుని తల్లి సునీత ఇచ్చిన ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ఇమామ్ తెలిపారు.

విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం

క్రోసూరు: మండల కేంద్రంలోని గ్రంథాయలంలో వేసవి విజ్ఞాన శిబిరం 33 వ రోజు సందర్భంగా విద్యార్థులు చేత పేపర్ క్రాఫ్ట్ , పుస్తకపఠనం, రంగు కాగితాలతో పూలు తయారు చేయడం నేర్పించడం జరిగిందని గ్రంథాలయ అధికారి వై.వీరాంజమ్మ శుక్రవారం తెలిపారు. దస్తూరి, కథల పోటీలు, పద్యాల పోటీలు, కుర్చీల ఆటలు, పోటీల్లో విజేతలకు ఈనెల 11న ముగింపు రోజు సందర్భంగా బహుమతలు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

పెదకూరపాడు: పెదకూరపాడులో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు పెదకూరపాడు -3 ఎంపీటీసీ నిర్మలా గోవిందరావు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ మండు టెండుల్లో పనులు చేస్తున్న కూలీలకు ప్రతిరోజూ మజ్జిగ ప్యాకెట్లు అందిస్తామన్నారు. మజ్జిగ ప్యాకెట్లు అందించిన ఎంపీటీసీకి కూలీలు కృతజ్ఞతలు తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ బాబూరావు ఉన్నారు.

వైఎస్సార్ యంత్ర సేవాతో పేదల జీవితాల్లో వెలుగులు

అమరావతి: నాపేరు అద్దంకి హనుమంతరావు మాది ఎండ్రాయి గ్రామం నా చిన్ననాటి నుంచి వ్యవసాయపనులు చేసేవాడిని. నాకున్న రెండెకరాల భూమిని సాగు చేసుకుంటు జీవనం సాగిస్తున్నాను. రెండెకరాల వ్యవసాయంలో జీవనం సాగక ఆదాయం చాలక చాలా ఇబ్బందులు పడేవాడిని. ఈసమయంలో నేను ట్రాక్టర్ డ్రైవింగ్ నేర్చుకుని రెండెకరాల వ్యవసాయంతో పాటు ట్రాక్టర్ డ్రైవింగ్‌తో వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషిస్తున్నాను. గత మూడేళ్ళుగా ఎండ్రాయిలో రైతుభరోసా కేంద్రం ద్వారా విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు తీసుకోవటమే కాకుండా వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటిస్తూ మరో పదిఎకరాలు కౌలు వ్యవసాయం ప్రారంభించాను. జగనన్న రైతులకు అండగా నిలిచి వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి ఇచ్చిన అన్ని పథకాలు ఉపయో గించుకుని గతంలో వ్యవసాయంలో చేసిన అప్పులన్నీ తీర్చేశాను. బిసి సామాజిక వర్గానికి చెందిన నాకు మొదటి నుంచి సొంతంగా ట్రాక్టర్ కొనుక్కుని నాతో పాటు పదిమంది చిన్నరైతులకు ఉపయోగపడాలనే కోరిక ఉండేది. నాకున్న ఆదాయాన్ని, ఆకోరిక కోరికగానే మిగిలింది. రెండేళ్ళ క్రితం మా గ్రామంలో కొంత మంది రైతులంతా కలిసి నంబూరి యువసేన రైతుమిత్రా గ్రూపు మొదలు పెట్టి రైతు భరోసా కేంద్రం ద్వారా వ్యవసాయ రుణాలు తీసుకుని సాగు చేస్తున్నాము. వైఎస్సార్ యంత్రసేవా పథకం ద్వారా యంత్రాలు సబ్సిడీపై ఇస్తారని రైతుభరోసా కేంద్రం సిబ్బంది చెప్పడంతో మా నంబూరి యువసేన రైతుమిత్రా గ్రూపు సభ్యులం సమావేశమై ట్రాక్టరు కొనుగోలు చేయాలని తీర్మానం చేసుకున్నాం. అదే సమయంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మా గ్రామానికి వచ్చినప్పుడు గ్రూపు సభ్యులందరం ఆయన్ను కలిసి మేమంతా సాగు చేసుకోవడంతో పాటుగా మరికొంత మంది రైతులకు ఉపయోగపడే విధంగా ట్రాక్టర్‌ను సబ్సిడీపై కావాలని కోరాం. ఆయన సాయంతో ఇటీవల వైఎస్సార్ యంత్రసేవా పథకం ద్వారా 8.64 లక్షల రూపాయల ట్రాక్టర్ 3.40 లక్షల రూపాయల సబ్సిడీ పోను 5.24 లక్షల రూపాలయకే మా గ్రూపుకు ట్రాక్టర్ ఇచ్చారు. మా గ్రూపులో ట్రాక్టర్ డ్రైవింగ్ తెలిసిన నేను మిగిలిన సభ్యులతో కలిసి ఈ ఏడాది ఇప్పటికే ట్రాక్టర్‌తో వంద ఏకరాల్లో దుక్కిదున్నటం, రోటోవేటర్‌తో దున్నడం చేశాం. జగనన్న నా లాంటి పేద చిన్నకారు రైతులకు ఇచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుని ఆదాయం పెంచుకున్నాం. జగనన్న మాకు చేసిన సాయం ఎప్పటికి మరచిపోలేం . రైతుభరోసా కేంద్రం ద్వారా భరోసానిచ్చి, వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా ట్రాక్టర్‌తో పాటు యంత్రాలిచ్చి ఆదాయం పొందడానికి మార్గం చూపిన సీఎం జగన్‌కి జీవితాంతం రుణ పడి ఉంటాం.



వైఎస్సార్ యంత్రసేవా పథకం కింద జగనన్న ఇచ్చిన ట్రాక్టర్‌తో అద్దంకి హనుమంతరావు

ఆరు జిల్లా పరిషత్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బదిలీ

రాజుపాలెం: మండలంలోని ఆరు జిల్లా పరిషత్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బదిలీ కాగా బదిలీపై వచ్చిన ప్రధానోపాధ్యాయులు శుక్రవారం విధుల్లో హాజరయ్యారు. రాజుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలకు పి.శైలజ, గణపవరం జిల్లా పరిషత్ పాఠశాలకు సుగుణమణి, అనుపాలెం పాఠశాలకు ఎం. సత్యనారాయణ, ఇనిమెట్ల జిల్లా పరిషత్ పాఠశాలకు విజయలక్ష్మీ,, పెదనెమలిపురి జిల్లా పరిషత్ పాఠశాలకు ఎం. నాగమల్లేశ్వరి, కోటనెమలిపురి జిల్లా పరిషత్ పాఠశాలకు ఎం .శైలజలు బదిలీపై వచ్చి హాజరయ్యారు.

పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బీమాపై అవగాహన

రాజుపాలెం: రాష్ట్ర ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వైఎస్సార్ పశుబీమాతో పాటు ఎద్దులకు, దున్నలకు గొర్రెలకు, మేకలకు, పందులకు బీమా ప్రవేశ పెట్టినట్లు పశు వైద్యాధికారి కంచుపాటి నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. నాటు గేదెలకు రూ.192లు, ముర్రా జాతి గేదెలకు రూ. 354లు చెల్లించాలని తెలిపారు. ఈ బీమా మూడేళ్ల వరకు వర్తిస్తోందని తెలిపారు.

మూడు గ్రామాలకు నూతన పంచాయతీ కార్యదర్శులు

సత్తెనపల్లి: మండలంలో మూడు గ్రామాలకు నూతనంగా పంచాయతీ కార్యదర్శులు రానున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా సత్తెనపల్లి మండలం అబ్బూరు పంచాయతీ కార్యదర్శి మహాలక్ష్మి వెంకట కృష్ణాపురం బదిలీ కాగా ఆమె స్థానంలో బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెం కు చెందిన షేక్ హుస్సేన్ రానున్నారు. గత కొంతకాలంగా ఖాళీగా ఉన్న భట్లూరు, పెద్దమక్కెన గ్రామాలకు ఇరువురు కార్యదర్శులను నియమించారు. తాడికొండ మండలం నిడుముక్కల పంచాయతీ కార్యదర్శి ఏ.సత్యనారాయణ భట్లూరుకు, తాడికొండ మండలం ముక్కమల్ల పంచాయతీ కార్యదర్శి జి. వెంకటే శ్వరరావు పెద్ద మక్కెనకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

పీహెచ్‌సీలో పౌష్టికాహారం పంపిణీ

సత్తెనపల్లి: మండల పరిధిలోని ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ పరీక్షల నిమిత్తం హాజరయ్యే గర్భిణులకు శుక్రవారం మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్టేట్ లీగల్ సెల్ ఇన్‌చార్జ్ మాగులూరి హరిబాబు, నరసింహారావు, కిరణ్ కుంచనపల్లి,కృష్ణారావు మాగులూరి, డాక్టర్ వేమవరపు ప్రదీప్, తదితరులు ఉన్నారు.

రేపు ఆదర్శపాఠశాలలో ప్రవేశపరీక్ష

నకరికల్లు: మండలంలోని దేచవరంలో గల ఆదర్శపాఠశాలలో ఆరోతరగతి ప్రవేశానికి ఈనెల 11వతేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ వేళాంగిణి మేరీ శుక్రవారం తెలిపారు. పాఠశాలలోనే ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు పరీక్ష జరుగతుందని తెలిపారు. అభ్యర్థులు ఉదయం 9గంటల కల్లా దేచవరంలోని ఆదర్శపాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. ప్రవేశపరీక్ష రాయనున్న విద్యార్థినీ, విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని వెంట తెచ్చుకోవాలని సూచించారు. వివరాలకు పాఠశాలలో సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజుపాలెం: మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం నేడు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఈ విషయాన్ని లబ్ధిదారులు గమనించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదకూరపాడు: పెదకూరపాడు, 75 త్యాళ్లూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో రెండో శనివారం విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ రామకృష్ణ శుక్రవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కౌలు కార్డుల పంపిణీకి నిబంధనలు సడలించాలి

ముప్పాళ్ళ: భూ యజమాని సంతకం ఉంటేనే కౌలు కార్డులు ఇస్తామని నిబంధనను రాష్ట్ర ప్రభుత్వం తొలగించాలని రాష్ట్ర కౌలు రైతుసంఘం అధ్యక్షుడు వై.రాధాకృష్ణ చెప్పారు. కౌలు రైతు సమస్యలపై పోరాటానికై ప్రారంభమైన ప్రచారజాత శుక్రవారం ముప్పాళ్ళ తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ సరళీకృత ఆర్థిక విధానాల వల్ల వ్యవసాయం నష్టాల సాగుతో నడుస్తుందన్నారు. అందులో ముఖ్యంగా కౌలు రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందక కుటుంబాలను పోషించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కౌలు రైతులకు కష్టాలు తీరాలంటే కౌలు చట్టాన్ని తప్పనిసరిగా మార్చాలన్నారు. భూ యజమాని సంతకం అనే నిబంధనను తొలగించి కౌలు రైతు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది కౌలు రైతులను గుర్తించి గ్రామసభ ద్వారా గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ప్రతి కౌలు రైతుకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం గ్యారంటీ లేకుండా పంట రుణాలు ఇవ్వాలన్నారు. పెరిగిన ధరల రీత్యా కౌలు రైతులకు భరోసాగా రూ.25వేల రూపాయలు పెంచాలని డిమాండ్ చేశారు. కేరళ తరహా రుణ విముక్తి చట్టాన్ని చేసి కౌలు సన్నచిన్న కారు రైతులు రుణాలు రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం రాష్ట్ర నాయకులు జీ.లక్ష్మీపతి, కౌలు రైతు జిల్లా అధ్యక్షుడు కె.రామారావు, సీఐటీయు రాష్ట్ర నాయకులు జి.విజయ్‌కుమార్, ముప్పాళ్ళ మండల కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లిబాలకృష్ణ, మండల కన్వీనర్ తౌరటిఅమరలింగేశ్వరరావు, నాయకులు మారూరి జగన్మోహనరెడ్డి, వెంకటాచారి, సాంబశివరావు, గారాజాలయ్య, కౌలు రైతులు పాల్గొన్నారు.



ముప్పాళ్ళ తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న రాధాకృష్ణ

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలి

ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాధాకృష్ణ

సత్తెనపల్లి: భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా పంట సాగు హక్కు చట్టం ప్రకారం గ్రామ సభల్లో కౌలు రైతులను గుర్తించి కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన జీపుయాత్ర శుక్రవారం సత్తెనపల్లి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక పుతుంబాక భవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ నేడు కౌలు రైతులకు గుర్తింపు కార్డులు లేకపోవడంతో ఈ క్రాప్ లో నమోదు చేయడం లేదన్నారు. ఈ క్రాప్ లో నమోదు కాకపోవడంతో కౌలు రైతులకు పంట రుణాలు, రైతు భరోసా, పంటల బీమా పరిహారం, నష్టపరిహారం వంటివి వర్తించకపోవడంతో కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వ్యవసాయంలో 50 శాతం నుంచి 70 శాతం వరకు కౌలు రైతులే పంటలు పండిస్తున్నారన్నారు.ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అందించే కొద్దిపాటి సహాయమైన అందక పోయినట్లయితే పెట్టుబడులకు ఇతర వ్యవసాయ అవసరాలకు ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తులపై ఆధారపడవలసి వస్తుంద న్నారు. రైతు భరోసా రూ.13,500 ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలకు కౌలురైతు గుర్తింపు కార్డు లేకపోవడంతో అందడం లేదన్నారు. ఓసీలలో ఉన్న భూమిలేని కౌలు రైతులందరికీ కూడా గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పంట పండించిన ధాన్యానికి అదనంగా ప్రభుత్వం బోనస్సు ఇచ్చి ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేసి కౌలు రైతులను ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కేరళ ప్రభుత్వం వరి ధాన్యానికి రూ. 2,060లకు అదనంగా మరో రూ.800 బోనస్ ఇచ్చి ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటుందన్నారు. కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 7న నెల్లూరు నుండి బయలుదేరిన ఈ జాత రాష్ట్రం మొత్తం పర్యటించి ఈనెల 12న మంగళగిరిలోని భూ పరిపాలన కార్యాలయం వద్దకు చేరుకుంటుందని అక్కడ వేలాది మంది రైతులతో రాయబారం జరుగుతుందని ఆయన తెలిపారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి బాలకృష్ణ, కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు కామినేని రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కమిటీ సభ్యులు బత్తుల బాలకోటయ్య, కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గంటా లక్ష్మీపతి లు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ భవానిశంకర్

నకరికల్లులో..

నకరికల్లు: సీసీఆర్‌సి కార్డుల ద్వారా కౌలు రైతులకు ప్రభుత్వం రాయితీలు, బీమాపథకాలు వర్తింపజేస్తోందని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. మండలంలోని కుంకలగుంట గ్రామంలో శుక్రవారం కౌలురైతుల అవగాహనాసదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు సాగుదారులు గుర్తింపుకార్డు కోసం భూయజమాని పట్టా దారుపాసుపుస్తకం, ఆధార్ నకలు, కౌలు దారుని ఆధార్ నకలు, పాస్‌పోర్టుఫోటోలు జతపరచి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కౌలు కార్డు కాలపరిమితి 11 నెలలే

తొండపి(ముప్పాళ్ళ): ప్రభుత్వం మంజూరు చేసే కౌలు కార్డు(పంటసాగు హక్కుపత్రం) కాలపరిమితి కేవలం 11 నెలలు మాత్రమేనని, భూ యజమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తహసీల్దార్ ఎం. భవానిశంకర్ చెప్పారు. మండలంలోని తొండపి, రుద్రవరం గ్రామాల్లో రెవెన్యూ, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పంటసాగు హక్కు పత్రం పై శుక్రవారం అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో తహసీల్దార్ భవానిశంకర్ మాట్లాడుతూ ఈ కార్డు ద్వారా పంట నమోదు చేసుకోవచ్చని, పంటల బీమా వర్తిస్తోందన్నారు. పంటలకు మార్కెట్ ధర లేనప్పుడు ఆర్బీకే ద్వారా పంట ఉత్పత్తులను అమ్ముకోవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డు ఉంటే రైతుభరోసా వర్తిస్తోందన్నారు. అయితే భూయజమానికి 2.5 ఎకరాల పైన భూమి ఉండాలన్నారు.

సంక్షేమ పథకాల చేరువకే గ్రామోదయం



మహిళతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సత్య నారాయణ, డాక్టర్ ప్రదీప్

సత్తెనపల్లి: సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందుతున్నాయా లేదా అనేది క్షేత్రస్థాయిలో పరిశీలనకే గ్రామోదయం జరుగుతుందని ఎంపీడీఓ జీవి సత్యనారాయణ అన్నారు. సత్తెనపల్లి మండలం వెన్న దేవి గ్రామంలో శుక్రవారం గ్రామోదయం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో యువకులు, గర్భిణులకు ఎనీమియా ఉన్నవారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. గర్భిణులు సక్రమంగా బాలామృతం అందుతుందా లేదా అనేది పరిశీలన చేశారు. క్రమం తప్పకుండా సక్రమంగా చెకప్‌లు, స్కానింగ్‌లు, డెలివరీ ప్లానింగ్ వంటి వాటి పై సూచనలు చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించి కూలీలతో చర్చించారు. వ్యూ లవ్ బుక్ రీడింగ్‌లో భాగంగా చిన్నారులతో మాట్లాడారు. ఎస్‌డబ్ల్యూపీసీ సెంటర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వేమవరపు ప్రదీప్, మండల విద్యాశాఖ అధికారి ఏ.శ్రీనివాసరావు, తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సుబ్బారావు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.


నార్నెపాడులో గ్రామోదయం

నార్నెపాడు(ముప్పాళ్ళ): మండలంలోని నార్నెపాడు గ్రామంలో గ్రామోదయం కార్యక్రమం శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసరావులు పాల్గొని గ్రామంలోని పారిశుధ్య చర్యలను పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి బాలింతలకు, గర్భిణులకు అందజేస్తున్న పౌష్టికాహారం పంపిణీని పరిశీలించారు. పౌష్టికాహారలోపంతో బాధపడుతున్న వారి వద్దకు వెళ్లి వారికి అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. గ్రామంలోని సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ కేంద్రాన్ని పరిశీలించి క్లాప్‌మిత్రలను సన్మానించారు. ముందుగా వారితో కలిసి అల్పాహారం చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రూపవతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ తస్లీమా, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత

పెదకూరపాడు: మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం, 75 త్యాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షల కోసం వచ్చిన గర్భిణులకు పౌష్టికాహారం శుక్రవారం అందజేశారు. ఈసందర్భంగా నిర్వాహకులు కృష్ణారావు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా ప్రతినెలా పరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద గర్భిణులు ఎక్కువ పౌష్టికాహార లోపంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారిని ఆదుకునేందుకు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

మస్తాన్‌రావుకు డాక్టరేట్ ప్రదానం



సత్తెనపల్లి: మండలంలోని కంటెపూడి సమీపంలో గల నలంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూ టికల్ సైన్సెస్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న సీహెచ్‌ఎన్ వి. మస్తాన్‌రావు కు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. వినాయక మిషన్ రీసెర్చ్ ఫౌండేషన్ (డీమ్డ్ టూ బి యూనివర్శిటీ, సేలం) వారు ఆయన సమర్పించిన పరిశోధన పత్రం 'నానో లిపిడ్ ఆధారిత డ్రగ్ డెలివరీ రూపకల్పన' మూల్యాంకనం మలేరియా నిరోధక అనే అంశంపై పరిశోధన జరిపి పత్రాలను గైడ్ డాక్టర్ ఆర్ మార్గరైట్ చండిరాకు సమర్పించారు. గత నెల 10న కమిటీ ఆమోదంతో మస్తాన్‌రావుకు డాక్టరేట్‌ను ప్రదానం చెశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్, ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆరిమండ వరప్రసాద్ రెడ్డి, కళాశాల ఫౌండర్ సెక్రెటరీ డాక్టర్ ఆరిమండ విజయ శారదా రెడ్డి, కళాశాల సెక్రటరీ ఆరిమండ సిద్ధార్థ్ రెడ్డి, ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ బ్రహ్మ రెడ్డి , సిబ్బంది, విద్యార్థులు శుక్రవారం మస్తాన్‌రావుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఏడుగురు లాటరీ టికెట్ల విక్రేతల అరెస్ట్

సత్తెనపల్లి: లాటరీ టికెట్లు విక్రయిస్తున్నారని అందిన సమాచారం మేరకు శుక్రవారం రాత్రి పట్టణ పోలీసులు పట్టణంలో దాడులు నిర్వహించారు. పట్టణంలో ఏడుగురు లాటరీ టికెట్ల విక్రేతలను అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ యు. శోభన్ బాబు తెలిపారు.

టీడీపీ విస్తృతస్థాయి సమావేశానికి ఆ ఇద్దరు డుమ్మా

సత్తెనపల్లి: టీడీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య పార్టీ నాయకులు ఇరువురు డొమ్మాకోట్టారు. టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జిగా కన్నా లక్ష్మీనారాయణ పేరు ప్రకటించాక స్థానిక నాయకులు గుర్రుగా ఉన్న విషయం తెలిసిందే. అయితే ఇటీవల సత్తెనపల్లి మాజీ శాసన సభ్యుడు వైవి ఆంజనేయులు తమతో కలిసి పార్టీ కోసం పని చేస్తారని కన్నా లక్ష్మీనారాయణ ప్రకటించినప్పటికీ తొలి విస్తృతస్థాయి సమావేశానికి ఆయన గైర్హాజరయ్యారు. మరో ముఖ్య నాయకుడు డాక్టర్ కోడెల శివరాం తనకు ఆహ్వానం అందలేదని, ఆహ్వానించి ఉంటే తెలుగుదేశం కార్యకర్తగా తప్పనిసరిగా హాజరయ్యే వాడినన్నారు. వర్గాలు లేవని చెబుతున్నప్పటికీ టీడీపీలో వర్గాలతో మదన పడుతున్నారు. సమావేశానికి కార్యకర్తలు సైతం పెద్దగా హాజరు కాకపోవడంతో సమావేశం అట్టర్‌ప్లాప్ అయ్యింది.

గర్భిణులకు పౌష్టికాహారంతో కూడిన అన్నసంతర్పణ

సత్తెనపల్లి: ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో సాయిబాబా సేవా సమాజం సహకారంతో 200 మంది గర్భిణులు శుక్రవారం పౌష్టికాహరంతో కూడిన అన్నసంతర్పణ చేపట్టారు. ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా గర్భిణులు అన్ని యూపీహెచ్ ఎస్సీలకు పరీక్షలు చేయించుకోవడానికి హాజరయ్యారు. ఆ గర్భిణులు అందరికీ అన్నసంతర్పణ ఏర్పాటు చేయాల్సిందిగా హెల్త్ విజిటర్ ప్రేమ కుమారి కోరగా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ పట్టణంలోని సాయి బాబా సేవ సమాజం వారిని అడగగా వారు వెంటనే స్పందించి ప్రతి నెల గర్భిణులకు అన్నసంతర్పణ చేసేందుకు ముందుకు వచ్చారు. సాయిబాబా సేవా సమాజం అధ్యక్షుడు చల్లా రత్తయ్య మాట్లాడుతూ తాము ప్రతి గురువారం సాయిబాబా గుడిలో అన్నసంతర్పణ చేస్తున్నామని, అదే విధంగా కొత్త రామకృష్ణ అడగడం వల్ల గర్భిణులకు ప్రతి నెలా అన్నసంతర్పణ చేయడానికి తాము ముందుకు వచ్చామని తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యశాల డ్యూటీ డాక్టర్ తనూజ, సాయిబాబా పాల్గొన్నారు.